సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 19 । జూలై । 2024



వరి రైతులూ ఇలా చేయండి

వరి సాగు చేపట్టే రైతులు కాలిబాట విధానాన్ని పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధానశాస్త్రవేత్త తేజేశ్వరరావు సూచించారు. 8లో



నిత్యం అప్రమత్తత అవసరం

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతం కావడంతో నిత్యం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి నూతన ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. 8లో



సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

షెడ్యూల్ ప్రకారం ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేయాలని డీఐఈవో అప్పలరాము ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

పద్ధతి మార్చుకోకుంటే గుణపాఠం తప్పదు

- ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి అమానుషం
- ప్రభుత్వం తీరుపై అరకు ఎంపీ తనూజరాణి ఆగ్రహం



సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం ప్రజల పాలనను పక్కన బెట్టి అరాచకాలతో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని, పద్ధతి మార్చుకోకుటే ప్రజల నుంచి గుణపాఠం తప్పదని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి హెచ్చరించారు. గురువారం ఆమె సాక్షితో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సంక్షేమ పాలనను పక్కనబెట్టి అరాచకాలు సృష్టించడం దారుణమన్నారు.నలభై అయిదు రోజుల పాలన ప్రజలు భయపడే స్థాయిలో సాగించడం దారుణమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా బాలికలు,మహిళలకు రక్షణ లేకుండా పోయిందని,అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

రాళ్లతో దాడి దారుణం : మూడు సార్లు ఎంపీగా ఎన్నికైన ఎంపీ మిథున్‌రెడ్డిపై రాళ్ల దాడి ఘటన అమానుషమని అరకు ఎంపీ తనూజరాణి ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని పేర్కొనేందుకు గత 45 రోజులుగా జరుగుతున్న హింసాత్మక ఘటనలే రుజువు చేస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలను టార్గెట్‌గా చేసుకుని చంద్రబాబు హింసను ప్రోత్సహించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంపీ మిథున్‌రెడ్డిపై రాళ్లదాడి, మాజీ ఎంపీ రెడ్డప్ప వాహనం దహనం చేసిన సంఘటనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎటపాక: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి జరిగే పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. జిల్లా పరిధిలోని 11 మండలాలు, కాకినాడ జిల్లాలోని ఏడు మండలాలు, తూర్పు గోదావరి జిల్లాలోని మూడు మండలాలకు చెందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 16వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు 01-05-2013 నుంచి 31-07-2015 మధ్య జన్మించిన వారై ఉండాలి. అన్ని వర్గాల వారికి ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2022-2023, 2023-2024 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో 3,4 తరగతులు పూర్తి విద్యా సంవత్సరం చదివి 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉండాలని ఆయన తెలిపారు. ప్రవేశపరీక్ష 2025లో జనవరి 18న జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



కూనవరం మండలంలో బోదునూరు, పైదిగూడెం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుతున్న ఉపాధి కూలీలు





వీఆర్‌పురం మండలంలోని అన్నవరం-ఉమ్మిడివరం మధ్య చప్టాపై నుంచి పొంగి ప్రవహిస్తున్న అన్నవరం వాగు, అవతలి పక్కన 30 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



చింతూరు, వీఆర్‌పురం రహదారి పైనుంచి ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు నీరు

విలీన మండలాల్లో వరద గుబులు

విలీన మండలాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరోపక్క మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి, శబరి నదుల్లో భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో ఎటపాక, వీఆర్‌పురం, కూనవరం, చింతూరు మండలాల ప్రజల్లో వరద గుబులు నెలకొంది.

- ఎడతెరిపి లేకుండా వర్షాలు
- వాగులు పొంగడంతో వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో నిలిచిన రాకపోకలు
- ఉప్పొంగుతున్న గోదావరి, శబరి
- క్రమేపీ పెరుగుతున్న నీటిమట్టాలు



ఎటపాక: నల్లకుంట, గౌరిదేవిపేట గ్రామాల మధ్య రహదారిపై వరద ప్రవాహంలోంచి రాకపోకలు

ఎటపాక: గోదావరికి వరద పోటు తప్పదనే సంకేతాలతో విలీన మండలాల ప్రజల్లో వరద గుబులు నెలకొంది. రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఏజెన్సీ ప్రాంతంలోని వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి.ఎగువ ప్రాంతాల నుంచి కూడా వరద నీరు గోదావరిలో చేరుతుండటంతో గురువారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 18.2 అడుగులకు నీటిమట్టం పెరిగింది. ఎగువన ఉన్న తాలిపేరు ప్రాజెక్టు నుంచి 12 గేట్లను రెండు అడుగు మేర ఎత్తి 14,474 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తున్నందున గోదావరి నీటిమట్టం గంటగంటకు పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.మహారాష్ట్రలో కూడా భారీగా వర్షాలు కురుస్తున్నందున ఇటు శబరి, తాలిపేరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు.

పొంగిన శబరి

చింతూరు: ఎగువనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా వస్తున్న వరదనీటితో చింతూరు మండలంలో శబరినది ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. సోకిలేరు, కుయిగూరు, చంద్రవంక, జల్లివారిగూడెం, చీకటివాగులకు వరద ఉధృతి నెలకొంది. తిమ్మిరిగూడెం, ఏజీకొడేరు నడుమ జల్లివారిగూడెం వాగుకు సంబంధించిన వరదనీరు చింతూరు, వీఆర్‌పురం మండలాల ప్రధాన రహదారిపై నుంచి స్వల్పంగా ప్రవహిస్తోంది. వాన ఉధృతి ఇలానే కొనసాగితే వరద ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

30 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వీఆర్‌పురం: మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తున్నందున మండలాన్ని ఆనుకొని ఉన్న శబరి, గోదావరి నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడికి సమీపంలోని అన్నవరం -ఉమ్మిడివరం గ్రామాల మధ్య వాగు పొంగి సప్టాపై నుంచి ప్రవహించింది. దీంతో మండల కేంద్రానికి సుమారు 30 గ్రామాలకు మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొద్దులగూడెం-సీతంపేట గ్రామాల మధ్య మొద్దులగుడెం చెరువు పొంగడంతో వరద నీటిలోంచి గ్రామస్తులు రాకపోకలు సాగించారు. శ్రీరామగిరిలో ఆలయ ప్రధాన వీధిలో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు.

కూనవరం: మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండంతో కొండ్రాజుపేట, బోదునూరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండ్రాజుపేట వాగు ఉధృతికి టేకులబోరు- కొండ్రాజుపేట గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. బోదునూరు వాగు ప్రవాహం కారణంగా పైదిగూడెం నుంచి బోదునూరుకు రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రాణాలకు తెగించి..

టేకులబోరు గ్రామానికి చెందిన సుమారు 30 మంది ఉపాధి కూలీలు రోజువారీ మాదిరిగానే బోదునూరు గ్రామ సమీపంలోని ఉపాధి పనులకు గురువారం వెళ్లారు. భారీ వర్షం కురవడంతో పనులను నిలిపి వేసి టేకులబోరు గ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలోని బోదునూరు వాగు ఒక్కసారిగా పొంగడంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఒకరి కొకరు చేతులు పట్టుకొని, తుప్పల సాయంతో ప్రాణాలకు తెగించి ఒడ్డుకు చేరుకున్నారు.

71.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మండల కేంద్రంలో గురువారం 71.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ప్రస్తుతం శబరి, గోదావరి నదుల ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. కూనవరం వద్ద గురువారం సాయంత్రం నాలుగు గంటలకు 10.26 మీటర్లు (14.92 అడుగులు) నమోదైనట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఎటపాక: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు వరదతో పొంగి పొర్లుతుండగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గోదావరి నదికి వరద క్రమేపీ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు కాపర్ డ్యామ్ నిర్మాణం కారణంగా బ్యాక్ వాటర్ ప్రభావంతో గోదావరి నది ప్రవాహ ఉధృతి పెరిగింది. మండలంలోని కన్నాపురం అలుగువాగు ప్రాజెక్టు వద్ద వరద నీరు పొంగిపొర్లుతోంది. ముర్రుమూరు, నందిగామ, తోటపల్లి, నెల్లిపాక, రాయనపేట, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గౌరిదేవిపేట ,నల్లకుంట, కృష్ణవరం, వీరాయిగూడెం గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరికి ఎగువన ఉన్న తాలిపేరు, దుమ్ముగూడెం ప్రాజెక్టు నుంచి వరదనీరు గోదావరిలో చేరడంతో భద్రాచలం వద్ద వరద పెరుగుతోంది. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గోదావరికి వరద పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అధికారులను అప్రమత్తం చేశాం

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వరదలపై చింతూరు డివిజన్‌లో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లాలో వరదలపై అధికారులతో గురువారం రాత్రి వీడియో సమీక్ష జరిపారు. జిల్లాలోని చింతూరు పరిధిలో 174 గ్రామాలకు వరద ప్రభావం ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక రాగానే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. బోట్లు,గజ ఈతగాళ్లతో పాటు ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో జేసీ భావన వశిష్ఠ, డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.



ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సమావేశానికి హాజరైన కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ భావన వశిష్ఠ



చింతూరు వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరినది



ఎటపాక మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నందిగామ వాగు



ఎటపాకలో కన్నాపురం అలుగు ప్రాజెక్టు వద్ద వరద ఉధృతి



భద్రాచలం ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకుంటాం

- డీసీహెచ్‌ఎస్ కృష్ణారావు
- చింతపల్లి ఏరియా ఆస్పత్రి సందర్శన
- సూపరింటెండెంట్ తీరుపై విచారణ
- వైద్యాధికారులు, స్థానికుల నుంచి వివరాల సేకరణ
- ఈనెల 22లోగా మరొక గైనికాలజిస్ట్‌ను నియమిస్తామని వెల్లడి



సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని పరిశీలిస్తూ చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో విచారణ జరుపుతున్న డీసీహెచ్ఎస్ కృష్ణారావు

సాక్షి ఎఫెక్ట్..

చింతపల్లి రూరల్: చింతపల్లి వైద్యవిధాన ఆస్పత్రిలో అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ డాక్టర్ కె. కృష్ణారావు స్పష్టం చేశారు. ఇక్కడి ఆస్పత్రిలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఆయన భార్య ఉద్యోగి కాకపోయినా జనన ధ్రువపత్రాల మంజూరుకు గిరిజనుల నుంచి మామూళ్లు వసూలు చేయడంపై గురువారం సాక్షిలో 'చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో పైసా వసూల్!' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఏపీ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. వారి ఆదేశాల మేరకు డీసీహెచ్ఎస్ గురువారం ఏరియా ఆస్పత్రిలో విచారణ జరిపారు. దీనిలో భాగంగా వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడారు. అక్రమ వసూళ్లపై వారి నుంచి వివరాలు సేకరించారు. జీతం బిల్లులకు సూపరింటెండెంట్ మామూళ్ల వసూలు చేస్తున్నారని పలువురు వైద్యులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకునేలా వారికి నివేదిస్తామని ఆయన తెలిపారు. గైనిక్ సేవలు గర్భిణులకు అందకపోవడాన్ని 'సాక్షి' ఆయన దృష్టికి తీసుకువెళ్లగా మరో గైనికాలజిస్ట్‌ను సోమవారంలోగా నియమిస్తామని చెప్పారు. విచారణలో పరిపాలన అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఇలావుండగా అక్రమ వసూళ్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ ప్రస్తుతం సెలవులో ఉండటం గమనించదగ్గ విషయం.

ఏయూ ఇన్‌చార్జ్ వీసీగా శశిభూషణరావు

సాక్షి, విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ జి.శశిభూషణ రావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీ చాంబర్‌లో ఇన్‌చార్జి వీసీగా గురువారం రాత్రి ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఏయూ ఈసీఈ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొ.శశిభూషణ రావు ప్రస్తుతం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 35 సంవత్సరాల సుదీర్ఘ బోధన అనుభవం ఉన్న ఈయన ఏయూలో ఈసీఈలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీ నుంచి పీహెచ్‌డీలను పూర్తిచేశారు. ఆయనకు 5 పేటెంట్లు సైతం ఉన్నాయి. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లను అందుకున్నారు.



బాధ్యతలు చేపడుతున్న శశిభూషణరావు

275కు పైగా పరిశోధన పత్రాలను, వివిధ స్కోపస్ జర్నల్స్ ప్రచురించారు. 5 పాఠ్యపుస్తకాలను, వివిధ పుస్తకాల్లో 11 చాప్టర్లు సైతం రచించారు. 2008లో సర్వేపల్లి రాధాకృష్ణ బెస్ట్ అకడమీషియన్ అవార్డును, బెస్ట్ రీసెర్చర్ అవార్డును అందుకున్నారు. ఆయన పర్యవేక్షణలో 9 రీసెర్చ్ ప్రాజెక్టులను పూర్తిచేశారు.

వైద్య విద్య మిథ్యేనా?

- పాడేరు వైద్య కళాశాలలో నిబంధనలకు అనుగుణంగా వసతులు
- ప్రారంభానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసిన గత ప్రభుత్వం
- అయినా అడ్మిషన్లకు అనుమతివ్వని జాతీయ మెడికల్ కౌన్సిల్
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘనత వస్తుండటమే కారణం
- పాలకుల తీరుపై సర్వత్రా విమర్శలు

పాడేరు వైద్య కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక్కడి వసతులను పరిశీలించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని అందరూ భావిస్తున్న తరుణంలో జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం నుంచి ఆమోదం లభించకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇప్పుడు వైద్యవిద్యను అందుబాటులోకి తెస్తే ఆ ఘనత అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తుందన్న అసూయతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియపై పట్టనట్టు వ్యవహరిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వైద్య విద్యకు సిద్ధమైన జిల్లా సర్వజన ఆస్పత్రి

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రంలో ఈ విద్యాసంవత్సరం నుంచి వైద్య విద్య అందుబాటులోకి తేవడమే కాకుండా గిరిజనులకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నత వైద్యసేవలను అందుబాటులోకి తేవాలన్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యానికి ప్రస్తుత పాలకులు తూట్లు పొడుస్తున్నారు. గత నెలలో పాడేరులో పర్యటించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం ఇక్కడ సౌకర్యాలపై సంతృప్తి చెందినప్పటికీ ఇంతవరకు అడ్మిషన్ల ప్రక్రియపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ప్రకటన చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పూర్తి సౌకర్యాలతో జిల్లా సర్వజన ఆస్పత్రి..

రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పాడేరు, పులివెందుల, మార్కాపురం, మదనపల్లి, ఆదోని వైద్య కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లను ప్రారంభించే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళికపరంగా చర్యలు చేపట్టింది. పాడేరులో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు ఈఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. దీంతోపాటు గిరిజనులకు ఉన్నత వైద్యానికి ఇబ్బందులు లేకుండా జిల్లా సర్వజన ఆస్పత్రిని అభివృద్ధి చేశారు.



పాడేరు జిల్లా ఆస్పత్రిలో కార్పొరేట్‌ను తలపించేలా పూర్తిస్థాయి సౌకర్యాలతో పడకలు

నిబంధనలకు అనుగుణంగా ముందస్తుగానే ఏర్పాట్లు

జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగా సుమారు రూ.4 కోట్ల వ్యయంతో జిల్లాలో ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం, కార్పొరేట్ స్థాయిలో వసతుల కల్పన, రోగులకు 420 పడకల ఏర్పాటు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర సౌకర్యాలన్నింటిని ఈఏడాది జనవరి నాటికే అందుబాటులోకి తెచ్చారు.అలాగే వైద్యనిపుణులు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర ఫ్యాకల్టీకి సంబంధించి 68 శాతం మేర పోస్టులను కూడా గత ప్రభుత్వం భర్తీ చేసింది. వైద్య విద్యను ప్రారంభించే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు ముందస్తుగానే చేపట్టింది.

సంతృప్తి వ్యక్తం చేసినా..

జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఏర్పాట్ల పరిశీలన తరువాత అడ్మిషన్ల ప్రక్రియకు ఆమోదం వస్తుందని వైద్యవర్గాలు భావించాయి. గత ప్రభుత్వం కూడా జనవరి నుంచి జాతీయ మెడికల్ కౌన్సిల్ రాక కోసం ఎదురు చూసింది. అయితే ఈ బృందం పరిశీలనలో కొంత మేర జాప్యం జరిగింది. మార్చి నెలకు ముందు వస్తారనుకున్న బృందం సభ్యులు జూన్ 24వ తేదీన పాడేరును సందర్శించారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో అన్ని విభాగాలను పరిశీలించిన బృందం 68 శాతం మేర ఫ్యాకల్టీ నియామకాలపై సంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య కళాశాల భవన నిర్మాణాలను పరిశీలించి పనులు త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశించింది. అయినప్పటికీ జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం అడ్మిషన్లకు క్లియరెన్సు ఇవ్వలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి.



సందర్శించిన మెడికల్ కౌన్సిల్ బృందం (ఫైల్)

నిరాశ పరుస్తున్న పాలకుల తీరు

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఇక్కడ బాధ్యతలు చేపట్టి పది నెలలు గడుస్తోంది. మిగిలిన వైద్యబృందాలు కూడా విధుల నిర్వహణలో నిమగ్నమయ్యాయి. అయితే వైద్య కళాశాల అడ్మిషన్లతో పాటు, సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు కూడా ప్రారంభం కాకపోవడం జిల్లా ప్రజలను నిరాశకు గురి చేస్తున్నాయి.

ఎదురుచూస్తున్నాం

పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రిలో 420 పడకలతో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం పరిశీలన పూర్తయ్యింది. ఇంతవరకు అడ్మిషన్లపై మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. మా శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

– డాక్టర్ డి.హేమలతాదేవి, ప్రిన్సిపాల్, వైద్య కళాశాల, పాడేరు

క్లుప్తంగా

నిత్యం అప్రమత్తత అవసరం

- ఎస్పీ అమిత్ బర్దర్
- ఎటపాక, చింతూరు పోలీసుస్టేషన్ల సందర్శన

ఎటపాక: మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలు కావడంతో నిత్యం అప్రమత్తంగా ఉండాలని, గోదావరి వరదల సమయంలో ప్రజలకు బాసటగా నిలవాలని నూతన ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. గురువారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. గంజాయి రవాణా నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్‌ఐలకు సూచనలిచ్చారు. నిర్మాణ దశలో ఉన్న ఓఎస్డీ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. చింతూరులోని ఏఎస్పీ, సీఐ కార్యాలయాలు, పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. అక్కడ నిర్మిస్తున్న పోలీసుస్టేషన్ భవనాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో సిబ్బందిని కాపలాగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాహుల్ మీనా, సీఐలు రామారావు,గజేంద్రకుమార్, ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

- డీఐఈవో అప్పలరాము

రాజవొమ్మంగి: షెడ్యూల్ ప్రకారం ఎప్పటి పాఠాలు అప్పుడే పూర్తి చేయడమే కాకుండా విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని డీఐఈవో అప్పలరాము సూచించారు. అధ్యాపకుల పనితీరు సరిగ్గా లేదని తల్లిదండ్రుల చేసిన ఫిర్యాదు మేరకు గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. తరగతులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. వారి నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఆయనను కోరారు. ప్రిన్సిపాల్ ఆర్ శిరీష, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎదురెదురుగా వచ్చి కారు-జీపు ఢీ

జి.మాడుగుల: మండలంలోని మద్దిగరువు మార్గంలో పులుసుమామిడి ఘాటీ రోడ్డులో గురువారం సాయంత్రం కారు, జీపు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ సంఘటలో కారు నుజ్జునుజ్జు అయింది. స్థానికుల కథనం ప్రకారం... జి.మాడుగుల నుంచి మద్దిగరువు వెళ్తున్న కారు, ఇటునుంచి ప్రయాణికులతో బయలుదేరిన జీపు ఎదురెదురుగా వస్తూ పులుసుమామిడి ఘాటీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. కారు సంతబయలుకు చెందిన వ్యాపారిదిగా, జీపు భీరం పంచాయతీ గుడంవీధి గ్రామానికి చెందిన వ్యక్తిదిగా వారు తెలిపారు.

రేపే గిరి ప్రదక్షిణ

సింహాద్రి అప్పన్నా.. అని ఆర్తితో పిలిస్తే అభయహస్తం అందించే స్వామి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహుడు. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ మహా విష్ణువు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిగా వెలసిన ఆధ్యాత్మిక క్షేత్రం ఇది. చందన పరిమళాలు, సంపెంగ సౌరభాలతో శోభిల్లుతున్న సింహాచల క్షేత్రంలోని ప్రధాన ఉత్సవాల్లో ఒకటి గిరి ప్రదక్షిణ. సింహగిరి చుట్టూ 32 కిలోమీటర్ల మేర కాలినడకన ఒక్కసారి ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణతో సమానమని భక్తులు భావిస్తారు. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం జరిగే గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.




సింహగిరి వ్యూ

- సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా..
- సాయంత్రం 4 గంటలకు తొలిపావంచా వద్ద స్వామి పుష్పరథం ప్రారంభం
- 21న తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతి
- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణ(గిరి ప్రదక్షిణ) శనివారం జరగనుంది. ఈసారి దాదాపు 5 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సింహాచలం, రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఫైర్, ఎక్సైజ్ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులు సేద తీరేందుకు 29 ప్రాంతాల్లో స్టాళ్లు, 22 ప్రదేశాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు, 11 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 12 చోట్ల 17 అంబులెన్స్‌లు, 9 జనరేటర్లు, ఆరు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఏర్పాట్లకు గురువారం వరుణుడు అడ్డంకిగా నిలవడంతో.. కొంత మేర ఇబ్బందులు ఎదురయ్యాయి.

సాయంత్రం 4 గం.కు పుష్పరథం ప్రారంభం

కొండదిగువ స్వామి తొలిపావంచా వద్ద నుంచి శనివారం సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభవుతుంది. స్వామి మూలవిరాట్, ఉత్సవమూర్తులు కొలువుదీరిన ప్రచార రథం బయలుదేరుతుంది. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులంతా ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

ఇవీ దర్శన సమయాలు : 20వ తేదీ ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. 21 ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. తిరిగి సాయత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 9 వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి.

21న ఆలయ ప్రదక్షిణలు : సింహగిరిపై 21న ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను తెల్లవారుజామున 3 గంటల నుంచి అనుమతిస్తారు. భక్తులంతా ఆలయ బాహ్య ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది.

పుష్పరథం తిరిగే మార్గం

తొలిపావంచా, అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటుంది.

ఉచిత ప్రయాణం

21వ తేదీ ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొండపై నుంచి దిగువకు భక్తులను దేవస్థానం బస్సులతోపాటు, దేవస్థానం నగదు చెల్లించిన 45 ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా చేరవేస్తారు.

భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

సింహాచలంలోని తొలి పావంచా, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.

కంట్రోల్ రూమ్‌లిక్కడే..

సింహాచలంలోని కొండదిగువ కలశం జంక్షన్, అడవివరం, హనుమంతవాక, అప్పుఘర్, మాధవదార, ఎస్ఎస్‌టీఎల్..

గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్‌కుమార్


క్యాన్సర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఇతర వైద్యాధికారులు

సాక్షి,పాడేరు: జిల్లా యంత్రాంగం సహకారంతో వై.ఎస్.జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్‌లకు సంబంధించి మెమోగ్రాం, పేప్ స్క్రీనింగ్ చేస్తారన్నారు. అనుమానాలు ఉంటే అల్ట్రా సౌండ్ పరీక్ష ద్వారా శరీరంలో అవసరమైన ఒక శాంపిల్ పార్ట్‌ను తీసి పరీక్షిస్తారన్నారు. పాజిటివ్ నమోదైతే బాధితులను అగనంపూడి హోమిబాబా క్యాన్సర్ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తారన్నారు. పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, వై.ఎస్.జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి రవీంద్రరెడ్డి, ఇతర వైద్యులంతా క్యాన్సర్ వ్యాధి ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు.

మలేరియా జ్వరాలపై అప్రమత్తం

జిల్లా వ్యాప్తంగా మలేరియా జ్వరాలుపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మూడు ఐటీడీఏల పీవోలు, వైద్య శాఖ అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించి మలేరియా నిర్మూలన కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గ్రామాలపై వైద్య బృందాలు మరింత దృష్టి పెట్టాలన్నారు. మలేరియా పీడిత గ్రామాల్లో రెండో విడత దోమల నివారణ మందును ప్రతి ఇంటి లోపల, బయట పిచికారీ చేయాలన్నారు. జ్వరపీడితులకు ఇంటి వద్దే వైద్య సేవలు కల్పించి, మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయాలన్నారు. పాజిటివ్ కేసులు నమోదైతే ఆ కుటుంబంలో అందరికి వైద్య పరీక్షలు చేయాలన్నారు. గ్రామంలో మాస్ స్క్రీనింగ్ జరపాలన్నారు. దోమల నివారణకు యాంటీ లార్వా కార్యక్రమాలు ఉధృతం చేయాలన్నారు. ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, వి.అభిషేక్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఎంవో తులసీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండేళ్లు గడుస్తున్నా అందని నష్టపరిహారం

- ఎన్‌హెచ్ 516ఈ రహదారి విస్తరణ బాధితుల ఆవేదన
- సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ దృష్టికి సమస్యలు
- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ


జి.మాడుగులలో హైవే నిర్మాణ బాధితుల డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న అధికారులు


బాధితురాలి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రాజవొమ్మంగి: రెండేళ్లు గడుస్తున్నా నేటికీ నష్టపరిహారం అందలేదని ఎన్‌హెచ్ 516ఈ రహదారి విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రంపచోడవరంలో జరిగిన గ్రీవెన్స్‌లో అందిన వినతుల నేపథ్యంలో గురువారం మండలంలోని జడ్డంగి వచ్చిన సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ బాధితులతో సమావేశమయ్యారు. గ్రామ సచివాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జడ్డంగి, దూసరపాము, రాజవొమ్మంగి, సూరంపాలెం తదితర గ్రామాలకు చెందిన బాధితులు తమ సమస్యలను సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులను పేరుపేరునా పిలిచి వారి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐ.పోలవరం నుంచి గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 516 ఈ రహదారి పనులకు 102 ఎకరాల భూమి అవసరమని గుర్తించగా ఇప్పటివరకు 50 ఎకరాలు మాత్రమే తీసుకున్నామన్నారు. మిగతా 50 ఎకరాల సేకరణ పెండింగ్‌లో ఉందన్నారు. సుమారు 20 ఎకరాలు సివిల్ డిపోజిట్‌లో ఉందన్నారు. మొత్తం 311 నిర్మాణాలు, ఇళ్లను గుర్తించగా ఇంకా 44 పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. వీటిలో 84 మిస్సింగ్ స్ట్రక్చర్లు ఉన్నాయన్నారు. ఈ అంశాలను హైవే అథారిటీ అధికారులకు తెలియజేస్తామని, వారి నుంచి ఆమోదం లభించగానే బాధితుల బ్యాంక్ ఖాతాలకు నష్టపరిహారం జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు నిర్వాసితులకు రూ.10 కోట్ల మేర నష్టపరిహారం చెల్లించామని ఆయన తెలిపారు. మరో రూ. 5 కోట్ల మేర పెండింగ్ ఉండగా రూ.3 కోట్లు సివిల్ డిపోజిట్‌లో ఉన్నట్టు చెప్పారు. ఆయన వెంటన తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్లు ఏ.సత్యనారాయణ, శ్రీధర్, జెడ్పీటీసీ జ్యోతి, ఎంపీటీసీలు పెద్దిరాజు, సత్యన్నారాయణ, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, చీడి శివ, కుంజం జగన్నాథం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ల పరిశీలన

జి.మాడుగుల: జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 516ఈ) నిర్మాణంలో ఇళ్లు, షాపులు కోల్పోయిన సంతబయలు,మత్స్యపురం, గాంధీనగరం ప్రాంతాల బాధితుల డాక్యుమెంట్లను హైవే అథారిటీ అధికారులు పరిశీలించారు. గురువారం స్థానిక విజయసాయి ఆలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. బాధితుల హక్కు పత్రాలను అధికారులు నిధి చౌదరి, చిరంజీవి అరుణకుమారి తదితరులు పరిశీలించారు.

నాణ్యతతో రోడ్డు పనులు చేయాలి

సీసీరోడ్డు నిర్మాణానికి అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం శంకుస్థాపన


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ టౌన్: అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని పద్మాపురం, పెదలబుడు సరిహద్దులో సంతోష్‌నగర్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.10 లక్షలతో 240 మీటర్ల సీసీరోడ్డు నిర్మిస్తామన్నారు. గతంలో రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కాంట్రాక్టర్లు అరకొర పనులు చేసి పనులు విడిచి పెడితే సహించేది లేదన్నారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా విడిచి పెట్టడంతో గిరిజనులు తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అటువంటి కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కాలనీ మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు తాగునీటి సమస్య అధికంగా ఉందని, బోరుబావి మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ రాముమ్, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, సర్పంచ్ పెట్టెలి సుస్మిత, ఎంపీటీసీలు ఎల్.బి. భీమరాజు, ఒలేసి కుమారి, దురియా ఆనంద్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.టి.ఆర్. సాంబయ్య, కమిడి అశోక్, సుబ్రయ్యచందు, కాంట్రాక్టర్ రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పెట్టెలి రాజుబాబు, జి. శ్రీకాంత్, ఆర్ఎమ్జీ మోహన్‌కృష్ణ, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాఫీ మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టండి

ఐటీడీఏ పీవో అభిషేక్


గోతులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: గిరిజనులు సిల్వర్ ఓక్ కాఫీ మొక్కలు నాటేందుకు శ్రద్ధ చూపించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. బారపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. ఇక్కడ సిల్వర్ ఓక్ మొక్కలు నాటేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా తవ్విన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సిల్వర్ ఓక్ కాఫీ మొక్కలను జాగ్రత్తగా పెంచుకుని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ మొక్కలు నాటేందుకు ఎకరానికి 700 గుంతలు తవ్విన తర్వాత వాటిని ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు పెట్టుకోవాలని సూచించారు. ఏపీడీ పవన్, ఏపీవో లింగమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లు, పాలు పక్కదారి పట్టడంపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న ఎంపీడీవో

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు పక్కదారి పట్టడంపై ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సీడీపీవో లక్ష్మీదేవి గురువారం విచారణ నిర్వహించారు. కమ్మరితోట అంగన్‌వాడీ కేంద్రం నుంచి గుడ్లు, పాలు విక్రయించేందుకు ధారకొండ తీసుకెళ్తుండగా స్థానికులు పట్టుకోవడం తెలిసిందే. ఈ ఘటనపై కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సీడీపీవో లక్ష్మీదేవి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అంగన్‌వాడీ కార్యకర్త జయంతిని కూడా విచారించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విచారణ నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. పర్యవేక్షకురాలు మోహిని తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి గిరిజన యువకుడి మృతి


శివ ప్రసాద్ మృతదేహం

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన చెదల శివప్రసాద్ (25) బుధవారం బలిజపాడు వద్ద కుంతీదేవి వాకలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మరణించాడు. గురువారం సర్పంచ్ తొంటా ఆదిరాజు తెలిపిన వివరాల ప్రకారం... శివప్రసాద్ తోటి వారితో కలసి కుంతీదేవి వాక అనే వాగులో చేపల వేటకు వెళ్లాడు. అతనికి ఫిట్స్ ఉండటంతో అకస్మాత్తుగా వాగులో పడిపోయాడు. మిగతా వారు కొంచెం దూరంలో ఉండటంతో ప్రసాద్ వాగులో పడిపోయిన సంగతి ఆలస్యంగా తెలుసుకున్నారు. నీటిలో పడిపోయిన అతడిని బయటకు తీయగా, అప్పటికే మరణించాడని వారు తెలిపారు. శివప్రసాద్ తల్లి గతంలోనే మరణించడంతో తండ్రి కృష్ణతోపాటు జీవిస్తున్నాడు. చేతికందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు మరణించడంతో కృష్ణ దుఃఖానికి అంతులేకుండా పోయింది. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని జడ్డంగి పోలీస్ స్టేషన్ ఎస్సై రఘునాథారావు గురువారం తెలిపారు.

పెట్టుబడి సాయం ఇవ్వడంలో విఫలం

అడ్డుమండలో రైతులతో కలిసి వరినాట్లు వేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు


అడ్డుమండలో వరి నాట్లు వేస్తున్న ఎంపీ తనుజారాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

హుకుంపేట: గత ప్రభుత్వ హయాంలో ఈ సీజన్‌లో పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నగదు అందించారని, దీన్ని ఇవ్వడంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీ డాక్టరు తనుజారాణి విమర్శించారు. మండలంలోని అడ్డుమండ గ్రామంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణలతో కలిసి గురువారం ఆమె పర్యటించారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలుపొంది మొదటిసారిగా అడుగు పెట్టిన సందర్భంగా గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీ తనుజారాణి సొంత పొలంలో గిరిజనులతో కలిసి కాసేపు వరి నాట్లు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజనులకు అన్ని వేలలలో అందుబాటులో ఉంటానని చెప్పారు. గిరిజనుల కష్టసుఖాలు తెలుసుకున్న ఏకైకపార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు.

దిగుమోదపుట్టు వంతెన నిర్మాణానికి చర్యలు..

హుకుంపేట పాడేరు అడ్డ రహదారిలో దిగువ మోదపుట్టులో వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కాతరి సురేష్‌కుమార్, సర్పంచ్‌లు గుమ్మా శ్యామ్‌సుందర్, సమిడ వెంకటపూర్ణిమ, చిట్టిబాబు, సాంబ, ఎంపీటీసీలు కొర్ర నాగరాజు, భీమలింగేశ్వరరావు, గంజాయి సుశీల, నాయకులు లక్ష్మయ్య, ఛత్రపతి తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులూ ఇలా చేయండి


గంపరాయిలో కాలిబాటలు వదిలి నాటు వేస్తున్న గిరిజన రైతులు


సూడోమోనస్ ద్రావణం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు, ఏవో శ్రీనివాస్

- జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు
- గంపరాయిలో అవగాహన కార్యక్రమం

పెదబయలు: వరి నాట్లు వేసే రైతులు తప్పనిసరిగా కాలిబాటల విధానం పాటించాలని జిల్లా ఏరువాక కేంద్రం పాడేరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. తేజేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని గంపరాయిలో వరిలో కాలిబాటల విధానంలో నాట్లు వేసే పద్ధతిపై వారు రైతులకు అవగాహన కల్పించారు.

ప్రయోజనాలివీ..

- వరి నాట్లు వేసే ముందు నారు చివర్లు తుంచాలి. దీనివల్ల కాండం తొలిచే పురుగు గుడ్లు ఉంటే నాశనం అవుతాయి. నారు వేళ్లను సూడోమోనస్ ద్రావణంలో ముంచిన 15 నిమిషాల తరువాత నాటుకుంటే వ్యాధులు సోకే అవకాశం తక్కువగా ఉంటుంది.
- కాలిబాటలు విధానంలో నాట్లు వేయడం వల్ల ఏమాత్రం అదనపు ఖర్చు ఉండదు. నాట్లు వేసుకునేటప్పుడు ప్రతీ 2.5 మీటర్ల నుంచి 3 మీటర్లు(10 అడుగులు) మధ్య ఒక అడుగు కాలిబాటగా విడిచి పెట్టాలి. దీనివల్ల వరి దుబ్బు మొదళ్లకు గాలి, వెలుతురు సోకవడం వల్ల పైరు ఆరోగ్యంగా ఉంటుంది. పైరును పరిశీలించేందుకు వీలుగా ఉంటుంది.
- సాగులో యంత్రాల వినియోగం వల్ల పెట్టుబడి, సమయం ఆదా అవుతుంది. కూలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండదు. డ్రమ్ సీడర్, కలుపు తీసే వీడర్ వంటి పరికరాలను వినియోగించడం వల్ల ఆర్థిక భారం తగ్గుతుందని వారు సూచించారు.